క్లుప్తంగా

వైద్యానికి ఆర్థికసాయం

రాయచోటి అర్బన్ : పట్టణంలోని కొత్తపల్లె ప్రాంతానికి చెందిన బాలికకు ఖరీదైన వైద్యం కోసం జిన్నా సేవా సంస్థ అధ్యక్షుడు జిన్నా షరీఫ్ ఆర్థిక సహాయమందించారు. కొత్తపల్లెకు చెందిన ఖాదర్‌బాషా ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. విధి వక్రీకరించడంతో రెండేళ్ల క్రితం ఖాదర్‌బాషా క్యాన్సర్ బారినపడి ఇంటికే పరిమితమయ్యాడు. కొద్దిరోజుల క్రితం ఖాదర్‌బాషా కుమార్తె నేహ (14)అనారోగ్యం పాలై ఏలూరు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటోంది. ఖరీదైన వైద్యం చేయించలేని ఖాదర్‌బాషా కుటుంబం విషయాన్ని జిన్నా సేవా సంస్థకు తెలిపి సహాయాన్ని కోరారు. ఇందుకు స్పందించిన సంస్థ అధ్యక్షుడు జిన్నా షరీఫ్ వైద్యం కోసం ఆదివారం కుటుంబీకులకు రూ. 17వేలు ఆర్థికసాయం అందించారు. దీంతో కుటుంబీకులు జిన్నా షరీఫ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


సొంత నిధులతో కల్వర్టు నిర్మాణం



కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తున్న దృశ్యం

చిన్నమండెం : మండల పరిధిలోని టి.చాకిబండ గ్రామం బలిజపల్లెకు చెందిన సుంకర శ్రీనివాసులు తన సొంత నిధులతో కల్వర్టు నిర్మాణం చేశారు. గతంలో ఈ రోడ్డు చాలా అధ్వాన్న పరిస్థితిలో ఉండేది. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో స్పందించిన సుంకర శ్రీనివాసులు తన సొంత నిధులతో కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభయాంజనేయస్వామికి పూజలు



ప్రత్యేక అలంకారంలో అభయాంజనేయుడు

పుల్లంపేట : మండల పరిధిలోని కోటగడ్డపై వెలసిన శ్రీ అభయాంజనేయస్వామికి ఆదివారం పూజారి శివశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని కాయాకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రత్యేక పూజల్లో కొరముట్ల



పూజ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కొరముట్ల

ఓబులవారిపల్లె : మండల కేంద్రం పరిధిలోని పున్నటివారిపల్లె గ్రామంలో మండల వ్యవసాయ సలహా మండల అధ్యక్షుడు నందలూరు వెంకటసుబ్బారెడ్డి స్వగృహంలో ఆదివారం ప్రత్యేక పూజల్లో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. నందలూరు వెంకటసుబ్బారెడ్డి నూతన గృహ ప్రవేశానికి ఆయన హాజరయ్యారు. పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌సీసీయూ మెంబర్ భరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ జి.సుధాకర్‌రాజు, కొర్లకుంట ఉప సర్పంచ్ ముక్కా రూపేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌పార్టీ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మతల్లీ..కరుణించమ్మా..

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు.

శిల్పారామంలో సందడి



కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక అఖిల్ డ్యాన్స్ అకాడమి చిన్నారులు తమ నృత్యాలతో అలరించారు. ఇటీవల విస్తృత ప్రచారంలో ఉన్న సినిమా పాటలతోపాటు జానపద గీతాలకు కూడా వారు హుషారు గొలిపే నృత్యాలతో ఆకట్టుకున్నారు. సందర్శకులు అడుగడుగునా ప్రోత్సహిస్తూ కరతాళ ధ్వనులు చేశారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రాజ్యసభ సభ్యులు మేడా రఘుకు ఘనస్వాగతం

- రేణిగుంట నుంచి రాజంపేటకు భారీ కాన్వాయ్
- గజమాలలతో స్వాగతం పలికిన నాయకులు, కార్యకర్తలు



రాజంపేట రూరల్: ఊటుకూరు వద్ద మేడా రఘుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

రాజంపేట రూరల్ : రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం ఘనస్వాగతం పలికారు. రాజ్యసభకు ఎన్నికైన అనంతరం తొలిసారి రాజంపేటకు విచ్చేస్తున్న రఘునాథరెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. రేణిగుంట విమానాశ్రయం నుంచి భారీ కాన్వాయ్ మధ్య రఘునాథరెడ్డి రాజంపేటకు విచ్చేశారు. యువత ద్విచక్రవాహనాలలో, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమ వాహనాలలో కాన్వాయ్ వెంట వచ్చారు. మండల పరిధిలోని ఊటుకూరు వద్దకు కాన్వాయ్ రాగానే అభిమానులు బాణసంచా పేల్చుతూ జై జగన్ అంటూ నినదించారు. అదే విధంగా అక్కడికి భారీగా వైఎస్సార్‌సీపీ నాయకులు చేరుకొని శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదే సమయంలో సిద్దవటం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరి, కాంట్రాక్టర్ రావుల సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో గజమాలను క్రేన్ సాయంతో మేడా రఘుకు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కాన్వాయ్ పట్టణంలోకి చేరుకోగానే పాత బస్టాండ్‌లోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి గజమాల వేసి మేడా రఘు నివాళులర్పించారు. తదనంతరం జాతీయ రహదారి వద్ద నున్న మేడా భవన్‌కు కాన్వాయ్ చేరుకుంది. అక్కడ ముందుగా రైల్వేకోడూరు శాసన సభ్యులు కొరముట్ల శ్రీనివాసులు మేడా రఘుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వందలాదిగా తరలి వచ్చిన నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపేందుకు పోటీపడ్డారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

నందలూరు మైనార్టీ నాయకుల సన్మానం



మేడా రఘునాథరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం



శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల

నందలూరు(రాజంపేట) : చెన్నయ్యగారిపల్లె గ్రామానికి చెందిన మేడా రఘునాథరెడ్డి రాజ్యసభ సభ్యులుగా మొదటిసారి నియోజకవర్గానికి చేరుకున్న సందర్భంగా జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. అనంతరం నందలూరు రైల్వే కేంద్రంలోని పలు సమస్యలను మేడాకు విన్నవించారు. నందలూరు రైల్వే కేంద్రంలో నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని రఘునాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి, ఏజీపీ షేక్ షమీవుల్లా ఖాన్, కలిముల్లా ఖాన్, మండల నేతలు మేడా శ్రావణ్‌కుమార్ రెడ్డి, గుణ యాదవ్, కేదార్ నాథ్, పసుపులేటి సుబ్రమణ్యం, హిమగిరినాథ్ యాదవ్, సర్పంచ్ మైనుద్దీన్‌లు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ అవతారంలో లక్ష్మీజనార్దనస్వామి

రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీజనార్దనస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారు శ్రీమహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ అర్చకులు పార్థసారధిబట్టర్, కులశేఖర్‌బట్టర్‌లు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్‌సేవతో పాటు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో వివిధ మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

మైనార్టీల సత్తా చూపిస్తాం

వాల్మీకిపురం: బీజేపీతో పొత్తు కోసం తహతహలాడుతూ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల నాయకత్వాన్ని అణగదొక్కడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు మైనార్టీల సత్తా ఏంటో చూపిస్తామని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ 94 మందితో ప్రకటించిన తొలి జాబితాలో మైనార్టీలకు కేవలం ఒక టికెట్ మాత్రమే కేటాయించడం టీడీపీకి మైనార్టీలపై ఉన్న చిత్తశుద్ధిని స్పష్టం చేస్తోందన్నారు.

ధ్యానంపై ధ్యాసతో మానసిక ప్రశాంతత



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రత్యేక ఆహ్వానితులు

రాయచోటి టౌన్ : శ్వాసపై ధ్యాస పెట్టి మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా తెలిపారు. ఆదివారం రాయచోటి శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో ధ్యాన సప్తాహ మహా సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధ్యానంపై ధ్యాస పెడితే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా వరంగల్ నుంచి వచ్చిన అబ్దుల్ రహీం మాట్లాడుతూ పురాతన కాలం నుంచి ధ్యానం ద్వారా ఎన్నో రోగాలను నయం చేసుకున్నారని తెలిపారు. అలాగే ధ్యానం ద్వారా ఆత్మజ్ఞానాన్ని పొందవచ్చుని తెలిపారు. తన జీవితంలో శ్వాస మీద ధ్యాసతో పొందిన లాభాలను వివరించారు. మాంసాహారం విడనాడి శాకాహారిగా మారితే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని తెలియజేశారు. అంతకు ముందుగా కార్యక్రమాన్ని ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో రాయచోటి పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ అధ్యక్షులు దేవకి సతీష్‌కుమార్, పబ్బిశెట్టి సురేష్‌కుమార్, డాక్టర్ బయారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



భక్తులకు అన్నదానం చేస్తున్న ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ శివారులో శివునిపల్లె గ్రామం ఎదురుగా వెలసిన శ్రీ కాశిరెడ్డినాయన స్వామి ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహకులు రామసుబ్బారెడ్డి వారికి శాలువా కప్పి పూలమాలతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వారు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, పల్లె సుబ్బరామిరెడ్డి, నాయకులు కె.వి. సుబ్బయ్య, గోపాలస్వామి, రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, తుర్రా ప్రతాప్, నాగ నరసింహారెడ్డి, ఎల్లారెడ్డి, మురళి, రావుల సుబ్బారెడ్డి, రోశిరెడ్డి, జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, దిలీప్, టి.వెంకటసుబ్బారెడ్డి, దిలీప్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బండలాగుడు పోటీలు

కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం వృషభ రాజములచే బండలాగుడు పోటీలు ప్రశాంతంగా సాగాయి. ఈ పోటీలకు మొత్తం 3 జతల ఎద్దు పాల్గొన్నాయి. బండలాగుడు పోటీలను రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. మొదటి బహుమతి రూ. 50 వేలును అనంతపురం జిల్లా లింగారెడ్డిపల్లెకు చెందిన దాసరి కిట్టు ఎద్దు గెలుచుకోగా రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డిల సహకారంతో ఎద్దల యజమానికి వైఎస్ఆర్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి అందజేశారు. రెండవ బహుమతి రూ. 30 వేలును ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీకి చెందిన ద్వారపాల గురివిరెడ్డి ఎండ్లు గెలుచుకోగా బహుమతిని మాజీ సర్పంచ్ మేకపాటి సుబ్బారెడ్డి ఎద్ల యజమానికి అందజేశారు. మూడవ బహుమతి కమలాపురం మండలం అక్కంపేట గ్రామానికి చెందిన గుత్తి ఆది ఎద్లు గెలుచుకోగా రూ.20వేల నగదును వైఎస్ఆర్‌సీపీ నాయకుడు నాగం నరసింహారెడ్డి ఎద్ల యజమానికి అందించారు. అంతకుముందు ఎమ్మెల్యే మేడా, కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి కాశిరెడ్డి నాయనకు వేర్వేరుగా పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.వి.సుబ్బయ్య, వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, రైతు విభాగం మండల కన్వీనర్ పల్లె సుబ్బరామరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు తుర్రా ప్రతాప్, కె.వి. సుబ్బారెడ్డి, క్రిష్ణ చైతన్య, నిమ్మకాయల ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి, శివరామిరెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, రోశిరెడ్డి, సుధాకర్, నాయకులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

మానవసేవే మాధవ సేవగా భావించాలి

నెలవారీ సేవా కార్యక్రమాల నిర్వహణపై మానవత సమావేశం



సమావేశంలో పాల్గొన్న మానవతా సభ్యులు

చిట్వేలి : మానవ సేవే మాధవ సేవగా భావించి ఆ దిశగా సేవలు అందించేందుకు సభ్యులు కృషి చేయాలని మానవత సేవా సంస్థ చిట్వేలి శాఖ నెలవారీ సమావేశం నిర్వహించారు. ఇందులో శాంతి రథం సమకూర్చుకొనుట, మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులందరికీ పెన్ను, ప్యాడ్‌లు సమకూర్చుట.. రాబోయే నెలలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు ఉచితంగా సమకూర్చుతున్న బాడీ ఫ్రీజర్ ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 9 గంటల లోపలే అందిస్తామని ఆపై అందించడం కుదరదని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని మానవతా సభ్యులు విజ్ఞప్తి చేశారు. అనాథ విద్యార్థి సాధిక్‌కు ప్రతినెలా ఆర్థిక సహాయం చేస్తామని, గతంలో ఇచ్చిన హామీ మేరకు విశ్రాంత ఉపాధ్యాయులు రంగారెడ్డి, ఉపాధ్యాయులు విశ్వనాథం, ఖాలేషాలు రూ. 500లు చొప్పున రూ. 1500లు విద్యార్థి సాధిక్‌కు అందజేశారు. కార్యక్రమంలో మానవత బాధ్యులు మురళీరెడ్డి, సాయిరాం, మునిరావు, గౌరవ సలహాదారులు, సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలోని అన్ని స్థానాల్లో ఏఐఎఫ్‌బీ పోటీ



మాట్లాడుతున్న ఏఐఎఫ్‌బీ జిల్లా కన్వీనర్ కాలేషా

రాయచోటి అర్బన్ : రానున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల నుంచి తమ పార్టీ పోటీచేస్తుందని ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) జిల్లా కన్వీనర్ కాలేషా తెలిపారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేశారన్నారు. అందులో వామపక్ష పార్టీల అభ్యర్థుల కంటే ఎక్కువ ఓట్లను సాధించడంతోపాటు కొత్తగూడెం స్థానంలో రెండవస్థానంలో నిలవడం జరిగిందన్నారు. ఏపీలోనూ తాము అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలుపుతున్నట్టు తెలియజేశారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథరెడ్డి

పీలేరు రూరల్: రానున్న సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథరెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జ్ పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మేళ్లచెరువు, తలపల ,జాండ్ల, గూడరేవుపల్లె,బోడుమల్లువారిపల్లె, ముడుపులవేముల, కావలిపల్లె, వేపులబైలు పంచాయతీల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు కలసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. పార్టీలో చిన్న చిన్న సమస్యలను, విభేదాలను పక్కనబెట్టి సమష్టి కృషితో గెలుపు కోసం పనిచేయాలన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిను గెలిపించి రాష్ట్రానికి రెండవ సారి జగనన్ను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సతీష్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ దండు జగన్మోహన్‌రెడ్డి, మండల సచివాలయల కన్వీనర్ ఆనంద్, మండల ఆర్బీకే చైర్మెన్ మల్లికార్జున, సర్పంచ్‌లు చిన్నకొండయ్య, సందీప్‌రెడ్డి, నీలిమా,జగన్మోహన్‌రెడ్డి, జయలక్ష్మీదేవి, రాజేష్, లోకనాథరెడ్డి, చెంగ్రలాయుడు, ఎంపీటీసీ కిరణ్‌కుమార్‌నాయుడు, వెంకట్రమణనాయుడు, చెంగ్రలాయుడు, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు



అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న పోలీసులు

మదనపల్లె : మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ఏపీపీఎస్సీ గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. శ్రీకృష్ణారెడ్డి సిద్దార్థ జూనియర్ కాలేజ్, శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కాలేజ్, శ్రీ సిద్దార్థ జూనియర్ కాలేజ్, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, బీటీ. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విశ్వం డిగ్రీ కళాశాల, అంగళ్లు మిట్స్‌కాలేజీలో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండటంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచే పరీక్షా కేంద్రాలకు అభ్యర్థుల రాక మొదలైంది. ప్రతి కేంద్రం వద్ద హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటుచేసి, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులను అందుబాటులో ఉంచడంతో కేంద్రంలోని రూములకు సంబంధించిన సమాచారం తెలిపారు. అభ్యర్థుల సెల్‌ఫోన్స్, బ్యాగులను ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఉదయం 10.30కు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 1 గంటవరకు జరిగింది. పరీక్షల నిర్వహణను ఏపీపీఎస్సీ మెంబర్ జీ.వి.సుధాకరరెడ్డి, ఆర్డీఓ హరిప్రసాద్ విశ్వం, మిట్స్, బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహణను పరిశీలించి, సిబ్బందికి పలుసూచనలు చేశారు.

ఆదర్శ కమ్యూనిస్టు పలవలి రామకృష్ణారెడ్డి

మదనపల్లె : రైతులు, కార్మికులు కోసం వెన్నుదన్నుగా నిల్చుని ప్రజా ఉద్యమాలకు ఒరవడి దిద్దిన పలవలి రామకృష్ణారెడ్డి ఆదర్శ కమ్యూనిస్టు అని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. పలవలి రామకృష్ణారెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా సీపీఎం మదనపల్లె ఆధ్వర్యంలో వర్ధంతిసభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన శ్రీనివాసులు మాట్లాడుతూ ఇండియా, చైనా యుద్ధంలో అరెస్టై జైలుకు వెళ్లడమే కాకుండా న్యాయవాద వృత్తి ద్వారా పేదలకు సేవలందించిన ఆదర్శ కమ్యూనిస్టు అన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తూ ఆశయ సాధనకు పునరంకితమవుదామని పిలుపునిచ్చారు.

పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి

కడప ఎడ్యుకేషన్ : మార్చి 3న ప్రతి చిన్నారికి తప్పని సరిగా పోలియో చుక్కలను వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన ఉందని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. రాయల్ రషీదు అసోసియేషన్ ఆధ్వర్యంలో తయారు చేసిన చిన్నారులకు పోలియో చుక్కలు అనే పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఆదివారం (3వ తేదీన) పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్ల పిల్లల వరకు పోలియో చుక్కలను వేయించుకోవాలన్నారు. ఈ విషయంపై బస్టాండులు, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు ఇంటింటి ప్రచారం నిర్వహించాలన్నారు.

ఎన్నికల నిర్వహణ పటిష్టంగా ఉండాలి

కడప ఎడ్యుకేషన్ : దేశవ్యాప్తంగా త్వరలో జరగనున్న పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో ఎటువంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా తగిన నిర్వహణ పరమైన ఏర్పాట్లు చేయాలని అఖిల భారత అభ్యుదయ వేదిక రాష్ట్ర కమిటీ కార్యదర్శి సురేష్‌బాబు కోరారు. ఆదివారం కడపలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలే ప్రజాస్వామానికి శ్రీరామరక్ష అని అన్నారు. ఎన్నికల నిర్వహణ న్యాయబద్ధంగా, సక్రమంగా జరిగినప్పుడే నిజమైన ప్రజాభిప్రాయం తెలియవస్తుందన్నారు. అధికారులు, రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో రాబోయే ఎన్నికల్లో పాల్గొనాలన్నారు. ఎన్నికల్లో అవకతవకలు జరిగి అనర్హులు అందలం ఎక్కితే ప్రజాస్వామానికి పాతరేసి నియంతృత్వం వచ్చే ప్రమాదం ఉందన్నారు. అభ్యుదయ వేదిక జిల్లా శాఖ అధ్యక్షులు విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి శంకరయ్య మాట్లాడుతూ ఎన్నికలలో ఓట్లు, డబ్బులు పంపిణీ చేయడం, పోలింగ్ సమయంలో దౌర్జన్యాలకు పాల్పడటం లేకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు



ఆపరేషన్‌కు రోగిని సిద్ధం చేస్తున్న వైద్యుడు

రాయచోటి అర్బన్ : రాయచోటి శివార్లలోని చెన్నముక్కపల్లె లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 16 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, కదిరి, తంబళ్లపల్లె, పీలేరు, వాయల్పాడు ప్రాంతాలకు చెందిన 55 మంది హాజరయ్యారు. వారికి కంటిపరీక్షలు నిర్వహించిన వైద్యులు 16 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. అలాగే గతంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న 35మందికి తిరిగి కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ స్వరూప్ గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, కంటివైద్యులు సురేష్‌బాబు, భార్గవి, ఆప్తాలమిక్ అసిస్టెంట్ రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చల్లంగా చూడు మా తల్లీ గంగమ్మ



సంబేపల్లె: అలంకారంలో నల్లగంగమ్మ



చిన్నమండెం: దర్శనమిస్తున్న మల్లూరమ్మ

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసిన శ్రీ మల్లూరమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారికి పలు రకాల అలంకరణలు చేశారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్ల గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వేకువజామునుంచే అమ్మవారికి అభిషేకాలు, పూజలు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. స్థానిక భక్తులతోపాటు పొరుగు రాష్ట్రాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ముస్లిం భక్తులు సైతం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త, ధర్మకర్తల మండలి చైర్మన్ మునగా మురళీస్వామి, ఈఓ కొండారెడ్డిల ఆధ్వర్యంలో భక్తుల వసతి సౌకర్యాలపై ఆరా తీశారు.

గంగమ్మకు భక్తుల బోనాలు

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గ్రామంలో వెలసిన అనంతపురం గంగమ్మకు ఆదివారం భక్తులు బోనాలతోపాటు తలనీలాలు అర్పించారు. ఆదివారం కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల వారు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రత్యేక అధికారి రవీంద్రరాజు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. పూజారులు శ్రీనివాసులు, సురేంద్రలు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



సంబేపల్లె: మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



లక్కిరెడ్డిపల్లె: పూజలందుకున్న గంగమ్మ